# చిత్రప్రభ

## మరపురాని ఉంగరం

ఆది ఒక మామూలు ఉంగరమే. మహా ఉంటే కాసు బంగారం ఉండచ్చు. కానీ, దాని విలువమాత్రం చెప్పలేనంత. నవ్వు వస్తొందా, కాసు బంగారం విలువ కూడ తెలియదా ఈమెకు అని? ఆ ఉంగరం ఎంతో ప్రేమతో ఇచ్చింది. ప్రేమకు ఖరీదు కట్టలేముకదా! ఉంగరం ఇచ్చిన వారు ఎవరా అని అనుకుంటున్నారు కదూ? ఆవిడే! శ్రీమతి గౌరి. ఆమెను మరిచి పోవటం అంత సులభంకాదు. నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకున్నది ఆమె. ఆ సంఘటన నా జీవితంలో మరపురానిది. సినీ నటీ నటులంటే ప్రేక్షకులకు ఆకర్షణ గానీ, ఈవిడ కేమిటి ఒక ప్రేక్షకురాలిపై ఇంతటి అభిమానం అని మీరు అనుకోవచ్చు.

ఇదంతా ఏమిటి ? అసలు విషయం బయటకు రాదేం?—అని మీరు అనుకొంటున్నారు కాబోలు. ఇదిగో చదవండి.

ఆగస్టు 4 వ తారీఖున నేను, మావారు ఇండొనీసియాలో జరిగే భారతీయ చలనచిత్ర ప్రదర్శనోత్సవానికి దక్షిణ భారత ప్రతినిధులుగా వెళ్లాము. మాతోబాటు మా అందరికీ నాయకుడుగా శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్‌గారు కూడ వచ్చారు. విమానం బయలుదేరేది రాత్రి 9 గంటలకే అయినా 7 గంటలకే వెళ్లి అక్కడ ఉండాలి. ఇతర దేశాలకు వెళ్ళేటప్పుడు వెంట తీసుకొని వెళ్ళే సామాన్లను కస్టమ్సులో ఉండే వాళ్లు పరిశీలించనిదే వెళ్లటానికి వీలుకాదు. ఈ పనులన్నీ ముగించుకోవటానికి రెండు గంటలు పడుతుంది. ఆ రోజు మాకు వీడ్కోలివ్వటానికి సినిమా పరిశ్రమలో ఉండే పెద్దలందరూ కూడ పూలమాలలతో వచ్చారు. వాళ్లతో పత్రికల వారు, ప్రేక్షకులు కూడ వచ్చారు. 9 గంటలకు సరిగా విమానం బయలుదేరింది. మాతోబాటు బొంబాయినుండి కుమారి వంద, జానీవాకర్ కూడ వచ్చారు. విమానంలో కూర్చుని, వెళ్లబోయే ప్రదేశం ఎలా ఉంటుందో అనే ఊహతోనూ, ఇక్కడ విమానాశ్రయంలో ప్రేక్షకులు ఎంతో ఆదరాభిమానాలతో వీడ్కోలిచ్చిన దృశ్యాలను తలచుకుంటూను ఉండగా ఎప్పుడు నిద్రపట్టిందో కూడ తెలియలేదు.

తెల్లగా తెల్లవారింది. నిద్ర బద్ధకం మాత్రం అట్లాగే ఉంది. సింగపూరు వచ్చింది, లేలే, అన్నారు మావారు. కళ్లు నలుపుకొంటూ టైము ఎంతయిందో అని చూస్తే 5 గంటలయింది. అప్పుడే సూర్యుడు కనిపిస్తున్నాడేమిటే అంటే మనకంటే ముందే సూర్యుడు పరుగెత్తుకొచ్చాడులే ఇక్కడికి అన్నారు. సింగపూరు టైము అప్పుడు 7 గంటలు. మే మందరమూ గడియారం ముల్లు రెండు గంటలు ముందుకు తిప్పిపెట్టాము. అక్కడ విమానాశ్రయం కూడ కనిపించనంతగా జనం. అక్కడుండే సినిమా ప్రేక్షకులలో తెలిసిన స్నేహితులు చాలమంది వచ్చారు. అక్కడే మా కందరికీ టిఫిన్లు కూడ ఏర్పాటు చేశారు. ఇండొనీసియాలో ఇడ్లీలు, దోసెలు దొరకవు, తినండి అని మొదలు పెట్టారు. ఈ వారం రోజుల్లో కనీసం రెండు మూడు పౌన్ల బరువు తగ్గించుకోవచ్చునను కొంటే, ఇవన్నీ ఏమిటండోయ్ అని నేను కొంచెం వెనక్కు తగ్గాను. కానీ, మావారు మాత్రం ఒక పట్టుపట్టారు. ఫలహారాలు ముగించుకొని స్నేహితులతో మాట్లాడుతూ కూర్చున్నాము. ఈలోపుగా ఇండొనీసియా వెళ్లటానికి విమానం తయారుగా ఉంది, ప్రయాణీకులు బయలుదేరాలి అని ప్రకటన చేశారు. సింగపూరు వాళ్లంతా ఆ ఊరెందుకండీ? ఇక్కడే ఉండండీ అని మొదలు పెట్టారు. మేము ముఖ్యంగా బయలుదేరింది ఆ ఊరికే, తిరిగి మద్రాసు వెళ్లేటప్పుడు సింగపూరు వచ్చి వెళ్లతాము అని చెప్పి వారందరి దగ్గర సెలవు తీసుకొని విమానం ఎక్కాము. 5 వ తారీఖు 10—30 గంటలకు ఇండొనీసియా ముఖ్య పట్నమైన జకార్తా చేరాము.

అక్కడ మమ్మల్ని ఆహ్వానించటానికి భారత రాయబార కార్యాలయంనుండి శ్రీయుతులు దరాషా, ఖోస్లా, సుబ్రహ్మణ్యంగారలు, అచ్చటి సినిమా నటీమణులు వచ్చారు. ఆ రోజు మొదలు రోజు కొక చలనచిత్రం ప్రదర్శించారు. చిత్రం రోజూ రాత్రి 9—30 గంటలకు ప్రారంభించేవారు. అక్కడ సినిమా హాల్సులో గాని, ఇళ్లల్లో గానీ ఎక్కడా పంఖాలు లేనే లేవు. ఏమిటిదీ అని అడిగితే పంఖాలు గాని ఏర్‌కండిషన్లు గానీ ఉపయోగిస్తే వాతం చేస్తుందన్నారు. చిత్రంగా ఉంది కదూ! మాకు చాల ఆశ్చర్యము, నవ్వు కూడ వచ్చాయి. మజ్జిగ ఉన్నదా అని అడిగితే, అంటే ఏమిటీ అని అడిగారు. మేము దానికి అర్థం చెప్పేటప్పటికి మా తాతలు దిగి వచ్చారు. ఆఖరికి అవి కూడ మేము తాగము, ఒంటికి మంచిదికాదు అన్నారు.

వెళ్లిన కొత్తలో ఎవరిని చూసినా ఒకే పోలికలు కనిపించినాయి. అక్కడి వాళ్లంతా కూడా మనదేశస్థులకంటే పొట్టిగా, తెల్లగా, చిన్న కళ్ళు, చొట్టముక్కులు; ఇంచుమించు అందరూ అట్లాగే ఉన్నారు. పగలంతా మాకేమీ పని ఉండేదికాదు. చుట్టుప్రక్కల ఉండే ఊళ్లు చూడాలని బుద్ధి పుట్టినది నాకూ, నందాకూ. అక్కడికి 45 మైళ్ల దూరంలో ఉన్న బొగోరుకు వెళ్లాము ఒక రోజున. అక్కడ గొప్ప గార్డెను ఉన్నది. ప్రపంచంలో ఉన్న గార్డెన్సులో ఇది కూడ ముఖ్యమైనదట.

చలన చిత్రాలు ప్రదర్శించటం మొదలు పెట్టారన్నానుగా, వెళ్లిన రోజునుండీ? మొదట రెండు హిందీ చిత్రాలు, మూడోది అపూర్ సంసార్ (బెంగాలీ) ప్రదర్శించారు. మొదటి రెండు చిత్రాలకూ సబ్ టైటిల్సు ఉన్నాయి. అంటే చిత్రం నడుస్తున్నప్పుడే ప్రతి ఒక్కరు మాట్లాడే మాటలను ఇండొనీసియా భాషలోను, ఇంగ్లీషులోను తర్జుమా చేసిన టైటిల్సు చిత్రంతోబాటు కనిపిస్తాయి. అట్లా చేస్తేనే మన భాషలు తెలియనివారు, మన భాషలలోని ఫిల్ములను అర్థం చేసుకోగలుగుతారు. మూడవ రోజున వేసిన చిత్రం అపూర్ సంసార్. సబ్ టైటిల్సు లేవు. చూసేవాళ్లకు అర్థంకాక రెండో రీలులోనే లేచిపోయారు చాలమంది జనం. నేను మావారు నటించిన మిస్సియమ్మ చిత్రాన్ని నాలుగవ రోజున ప్రదర్శించబోతు

న్నారు అనగానే సబ్ టైటిల్సు ఉన్నవా లేవా అని అడిగాము. అదే ఆలోచిస్తున్నాము; కొంత వరకు టైటిల్స్ సిద్ధం అయినాయి; కానీ సాయంత్రంలోపుగా మొత్తం సిద్ధంకావటం కష్టం అన్నారు. అదీగాకుండా మేము 9వ తారీఖున సింగపూర్ బయలుదేరాలి; 12 వ తారీఖున మద్రాసు బయలు దేరాలి కనుక ఎట్లాగైనా సరే టైటిల్సు తయారు చెయ్య వలసింది అని అడిగాము. అట్లాగే శ్రమపడి సబ్ టైటిల్సు తయారు చేసి 8 వ తారీఖున మిస్సియమ్మ ప్రదర్శించారు. చిత్రం ప్రారంభించింది మొదలు ఒకటే నవ్వు,చప్పట్లు. చిత్రం పూర్తి అయేవరకూ ఉండి ఆఖరిని ఒకసారి మళ్లీ చప్పట్లు కొట్టి లేచారు. మా ఇద్దరినీ చాల పొగిడారు. ఎంతో ఆదరాభిమానాలతో మాట్లాడారు. నిజ జీవితంలోను, చిత్రాల లోను కూడ భార్యా భర్త లయినందుకు మాకెంతో సంతోషం అని మమ్మల్ని ప్రశంసించారు.

మర్నాడు ఉదయం 7—30 గంటలకు విమానం సింగపూర్ బయలు దేరుతుంది; వెళ్ళుదామని నాకు తెలియకుండానే 9 వ తేదీ బుక్‌చేసిన టికెట్లుతీసి చూపించారు మావారు. ఆరోజున జకార్తాకు జైహింద్ చెప్పి సింగపూర్ ప్రయాణమయ్యాము. 12 గంటలలోపుగా సింగపూర్ చేరినాము. మేము అక్కడికి వచ్చే తేదీ ఎవరికీ తెలియకూడదని స్నేహితులకు మాత్రం టెలిగ్రాం ఇచ్చాము—సింగపూర్ వస్తున్నట్లుగా. ఎట్లాగో పసికట్టి వచ్చేశారు జనం. అక్కడున్న రెండు మూడు రోజులు టైమే తెలియకుండా గడిచిపోయింది. ఒక రోజంతా మేము ఎక్కడికి వెళ్లితే అక్కడికి సింగపూర్ రేడియోవారు టేపు రికార్డుతో సహావచ్చి మేము మాట్లాడిన మాటలూ, వారు అడిగిన ప్రశ్నలకు మా సమాధానాలూ రికార్డుచేసి రేడియోలో ప్రసారం చేశారు. పత్రికల వారంతా కలిసి ఒకరోజున సభ ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రం చలనచిత్ర సంఘంవారు టీపార్టీకి ఆహ్వానించారు. ఆ సంఘం లో తెలుగువారు కూడా ఉండుటవలన ఒక్క అరవం లో నే కాక తెలుగులో కూడా మాట్లాడాను. అక్కడున్న ఆంధ్రులందరికీ ఒకటే సంతోషం—ఇన్నాళ్లకు తెలుగు మాట్లాడేవారు వచ్చారని. టీపార్టీ అయిన తరువాత బయటకు వచ్చేసరికి గుండె ఝారుమన్నది. ఎందుకో తెలుసా? అక్కడున్న జనాన్ని చూసి. ఇద్దరు పోలీసులను మాత్రమే తీసుకొని వచ్చారు సంఘంవాళ్లు. మా కందరికీ కూడా భయం వేసింది బయటకు వెళ్లలేమని. ఈ లోగా ఎవరో వచ్చి ఏమండీ, దొడ్డిదారిన వెళ్లిపొండి, కారు అక్కడకు రప్పిస్తామన్నారు. అందుకు మావారు ఒప్పుకోలేదు. ఇంతమంది జనం మమ్మల్ని చూట్టాని కనివస్తే వాళ్లను నిరుత్సాహపరిచి వెళ్లడం భావ్యం కాదనీ, ఎక్కువమంది పోలీసులను



పిలిపిస్తే వాళ్ళ జనాన్ని ఒక క్రమంలో నిలుచో బెడతారనీ, అప్పుడు మేము వారందరి ముందునుంచే వెళ్ళుతామనీ అన్నారు. ఈ ఏర్పాటు అంతా అయి మేము బయట అడుగు పెట్టడానికి చాలా టైము అవుతుందని అన్నారు. సరే మేమలా నమస్కారం పెట్టుతూ వెళ్ళితే వాళ్లంతట వాళ్లే దారి వదలుతారని నేను ఒక పెద్ద ఉపాయంలాగ చెప్పాను. సరే, నీకు ధైర్యం ఉంటే అలాగే చేద్దామన్నారు. ఎత్తిన చెయ్యి దించకుండా అట్లా నమస్కారం పెట్టుతూ వెళ్లాము. మేమనుకొన్నది ఒకటి. అక్కడ జరిగిందొకటి. మేము ఎప్పుడయితే బయలుదేరామో అప్పుడే వాళ్ళు వరుసగా నిలబడి మాకు బదులు నమస్కారం చేస్తూ చప్పట్లు కొట్టారు.

ఆ తరువాత టైగరుబాం గార్డెనుకు వెళ్లి చూశాము. ఎంతో అద్భుతమైన బొమ్మల తోను, నకిలీచెట్లు పువ్వులతోను తయారు చేశారు ఆ గార్డెన్ను. చూడడానికి చాలా బాగున్నది.

12వ రోజు దగ్గర పడింది. మద్రాసు వెళ్లడానికి సిద్ధ మయ్యాము. మా అభిమాను లంతా వచ్చారు. వారందరితో మాట్లాడుతూ రెండు మూడు గంటలు గడిపాము. వాళ్లంతా కూడా నాగేశ్వరరావుగారు, రామారావుగారు, అంజలీదేవిగారు, జమునగారు వీళ్లంతా రారా ఈ ఊరికి? వాళ్లందర్నీ చూడాలని మాకెంతో ఆశగా ఉంది. ఎప్పుడు వస్తారు? అని అడిగారు. వాళ్ళూ మేము వచ్చినట్లే ఎప్పుడో వస్తారు అని చెప్పాము. వాళ్లందరూ మా పాపకు బొమ్మలు, గౌన్లు ఇంకా ఎన్నో బహుమతులు ఇచ్చారు. అవన్నీ మేము తీసుకొని రావడానికి వీలులేదు. కానీ ఏం చెయ్యము? కొన్ని అక్కడే వదిలి, కొన్ని మాత్రమే తీసుకొని రాగలిగాము.

12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు విమానంలో బయలుదేరటానికి విమానాశ్రయానికి వెళ్ళాము. అబ్బ! ఎంత జనమో చెప్పలేము. వాళ్ళందరినీ చూస్తూ బాల్కనీలో నిలబడి ఉన్నాను నేను. ఈ లోగా వెనుకనుండి నా భుజాన్ని ఎవరో తడివి తల నవరిస్తున్నట్లు తోచింది. వెంటనే తిరిగా చూశాను. ఎవరో ఇద్దరమ్మాయిలు. నాచేతులు పట్టుకొని నావైపు చూస్తూ ఉండిపోయారు. కాసేపటికి నేను పలుకరించాను. సింగపూర్‌కు 200 మైళ్ల దూరంనుండి వచ్చాము; మిమ్మల్ని చూడాలని అయిదారు సంవత్సరాలుగా ఎంతో ఆశగా ఉంది; అది ఈనాటికి నెరవేరింది అని కళ్లలో నీళ్లు తిరిగి బొటబొటా రాలిపోయినవి వారి ద్దరిలో ఒక అమ్మాయికి. ఆమె శ్రీమతి గౌరి. ఆమెతో మాట్లాడుతూండగానే విమానం టయిమయిందని జ్ఞాపకం చేశారు. నేను బయలుదేరబోతూండగా గౌరి తన వ్రేలికున్న ఉంగరం తీసి నావేలికి పెట్టింది. అక్కడున్న జనసమ్మర్దంలోను, తొందరలోను ఆమెకు నా కృతజ్ఞత చెప్పడానికి కూడా వీలులేకుండా పోయింది. ఇప్పుడు తెలిసింది కదూ మొదట చెప్పిన ఉంగరం సంగతి ?

రాత్రి 9 గంటలకు మద్రాసు చేరుకొన్నాం. మాకు స్వాగతం ఇవ్వడానికి పూలమాలలతో శ్రీ నాగిరెడ్డి, శ్రీ పుల్లయ్యగారు, జగపతి పిక్చర్సు దర్శకులు శ్రీ మధుసూధనరావుగారు, నిర్మాత బాబూ రాజేంద్రప్రసాద్‌గారు, దర్శకులు భీమ్‌సింగ్‌గారు, తదితర పెద్దలూ, స్నేహితులూ వచ్చారు. మేము లోపలినుండి రాకముందే మాచిరంజీవిని వాళ్ల తాత గారితో సహా (శ్రీ కె. వి. చౌదరిగారు) వచ్చింది పెద్ద పూలదండతో. మాఇద్దరిమెళ్లో వేసి ముద్దుల వర్షం కురిపించింది.

గౌరి నాఅభిమాన ప్రేక్షకురాలు. గౌరీ! అమాయకమైనటువంటి నిర్మలమైనటువంటి నీముఖ బింబం నీవిచ్చిన ఉంగరంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. నీ జ్ఞాపకమే నాహృద యంలో నిరంతరం ఉండిపోతుంది.

